అనేకులుగా ...

(కవిత్వం)



మాకినీడి సూర్య భాస్కర్

సౌమ్య పబ్లికేషన్స్

9-3-6/1ఎ, సరస్వతీనిలయం, గాంధీనగర్, కాకినాడ-533 004

ఫోన్స్: 94915 04045, 89852 17627, 0884-2364421

అనేకులుగా ... కవిత్వం

రచయిత:

మాకినీడి సూర్య భాస్కర్

ప్రథమ ముద్రణ: మే 2019
వెల: 120/-

ప్రతులకు:

శ్రీమతి మాకినీడి సుభద్ర

9-3-6/1ఎ, సరస్వతీ నిలయం


గాంధీనగరం, కాకినాడ-533 004

ఫోన్: 94915 04045, 89852 17627



నాలోని నీకు ...

నన్ను తామరాకు
చేసినందుకు!


ఈ నా కవితలకు
ప్రేరణ, స్పందన కలిగించినవారికీ
ఆయా సమయ సందర్భాలకీ
కృతజ్ఞతలు
– మాకినీడి సూర్య భాస్కర్

కవితల క్రమం

మాకినీడి ముద్రిత గ్రంథాలు

కవిత్వం:

1.సుమ కవితాంజలి
2. ప్రకృతి గీసిన వికృత చిత్రం
3. సెలవ రోజు
4. కలల పెదవుల నవ్వుల్లోకి...
5. సామెతకో పద్యం
6. పాపికొండల్లో పడవ పాట
7. ఆమె (దీర్ఘ కవిత),
8. తడితడిగా ఆలోచించే...
9. నాకు నేను దొరికిన క్షణాలు...

హైకు సంపుటాలు:

10. హైకూ చిత్రాలు
11. ప్రకృతి (ఫొటో హైకు)
12. రాలిన పుప్పొడి
13. ఋతు రాగాలు
14. హైకు–హైగా

బాలసాహిత్యం:

15. జ్యోతి బాల
16. స్వర్ణభారతి
17. తెలుగు భాష– ప్రస్తుత ఘోష
18. వెన్నెల
19. బాల్యం ఒక పాట
20. **అంతస్సౌందర్యం (కథలు)**

సాహిత్య విమర్శ:

21. కళాసాహితీ తోరణం
22. హైకూ కవిత్వం–అనుశీలన
23. నానీలు–నాలుగు వ్యాసాలు
24. కలం కలలు
25. దృక్కోణం
26. రెండు ఎలిజీల మధ్య
27. తాత్త్విక రెక్కలు – ప్రస్థానం
28. అద్దేపల్లి కవిత్వం–వ్యక్తిత్వం, తత్త్వం
29. అమ్మ – పరిమళ వ్యాఖ్యానం
30. పద్యం–హృద్యం
31. అద్దేపల్లి కవిత్వం–పరిణామం
32. సత్యాన్వేషణలో...
33. కంచి చేరిన కథలు

కళావిమర్శ

34. కళావిమర్శక వ్యాసాలు
35. కళాస్రవంతి–ఆంజనేయులు
36. ఆర్ట్ స్కూల్ (చిత్రకళ పాఠాలు)
37. రామారావు నుంచి రామారావు దాకా
38. మన చిత్రకారులు
39. దామెర్ల – ఆధునికాంధ్ర చిత్రకళ ఆద్యుడు
40. సంజీవదేవ్ – ప్రకృతి 'గీతా'లాపకుడు
41. డా॥ పి.ఆర్. రాజు చిత్రాలు – సౌందర్య వర్ణగీతాలు
42. కళ, కళావిమర్శల పోటుగాడు చలసాని
43. బాపు'రే' – రేఖీయాభివ్యక్తి
44. డా॥ మాచిరాజు – వర్ణసంగీత మాంత్రికుడు
45. రావు వెంకటరావుగారి 'చిత్రమాలిక – స్వర్ణ జ్ఞాపిక'

మాకినీడిపై వచ్చిన పుస్తకాలు:


46. రచన–రసన (మాకినీడి సాహిత్య వ్యక్తిత్వ విమర్శ)
47. దృష్టి–సృష్టి (మాకినీడి కళాసమీక్ష)
48. మాకినీడి కళాసాహితీ జీవన రేఖాంకన
49. నింగీ–నేల (దీర్ఘ వ్యాసం)–డా. ఎం.వి.వి.ఎన్;
50. ఎం. శేఖర్, 'మాకినీడి వచనకవితా సంపుటాలు–పరిశీలన
51. ర్యాలి శ్రీనివాస్, 'సంపాదకుడిగా మాకినీడి'
52. వి.విజయకుమార్, 'మాకినీడి సమగ్ర సాహిత్యం–పరిశీలన'
53. శ్రీహస్త రచించిన 'మనసున్న కవి మాకినీడి'

ఎకడెమిక్ గ్రంథాలు :

54. పాఠశాల పాలన
55. ఎయిడ్స్ నియంత్రణ, చికిత్స (బుర్రకథ)
56. చదువుల పండుగ
57. సైంటిఫిక్ టెంపర్
58. కొలెస్ట్రాల్
59. Infant Feeding
60. అల్లూరి సీతారామరాజు (బుర్ర కథ)
61. తరాల మార్పు కోసం బాలసాహితి (మోనోగ్రాఫ్)
62. తెలుగు మనుగడకు వెలుగు మార్గాలు (తానా అవార్డు విన్నర్),

చిరుగ్రంథ కానుక – మరుగంధ మాలిక

63. గూడ శ్రీరాములు వ్యాసాలు – నిగూఢ విమర్శక విన్యాసాలు
64. మినీ కథన బ్రహ్మ – కె.బి. కృష్ణ
65. కదలి బ్రతుకుల కల్లోల సరళి
66. రాంషా రచనలు – వైశిష్ట్యం
67. ప్రజాచిత్రకారుడు మోహన్
68. మధునాపంతుల కవిత్వం – తత్త్వం
69. అసిధారావ్రతం(అశోక్ కుమార్ సింగంపల్లి కవిత్వ విమర్శ)
70. దామెర్ల కళ – వారసత్వం...
71. **అనేకులుగా... (కవిత్వం)**



అనేకులుగా

కవిత్వం

17 ... 71 !!!

అ నే కు లు గా . . .

ఇది నా 17వ కవితా సంపుటి
71వ ముద్రిత పుస్తకం!
ఆశ్చర్యం కాదూ!!

రెక్కలు మొలవనీ...

రెక్కలంటే–
ఎగరడమే!

రెక్కలు మొలిస్తేనే
నల్లని గొంగళి సీతాకోకై
రంగుల రాగాలై ఎగురుతుంది.

రెక్కలకు మారు పేరు ఊహలు
ఊహలు ఊడలైతేనే
సృజన రెక్క విప్పుతుంది

రెక్కలు మొలవని మనసు
వికసించని సొగసు
ఆలోచనలుడిగిన వయసు
ముక్క చెక్కల అక్కసు

రెక్కలు–
మొలిస్తేనే...
సృజన పక్షై
ఎగురుతుంది మనసైనా!

మొలవనీ రెక్కలు!
కలవనీ రిక్కలు!!

6–11–2015, శుక్ర:
9.40–9.52 ఎ.ఎం

అనుభూతి సాధ్యం...

సంతసం వసంతమైనప్పుడో
సంతాపం గ్రీష్మమైనప్పుడో...

నీటిచెలమలౌతాయి కళ్ళు
కన్నీటి కాసారాలౌతాయి!

నిండా పారిన పరియలు వారిన
ఆ నీటిని...కన్నీటిని-

మనసు పొలానికి పంపాలి
అనువుగా అక్షరవిత్తులు నాటాలి
అనుభవసారాన్ని ఎరువుగా వెయ్యాలి
కవితాసేద్యం చెయ్యాలి
కన్నీటి సేద్యం - కవితాసేద్యం
నిండా అనుభూతి సాధ్యం!

25-4-16 సోమ: 4.40
నుండి 4.49 ఎ.ఎం

లోపలుంటేనే...

పండులోపల దాగిన విత్తు
పంటగా విరగపండేది
బయటికొచ్చాకనే!

విత్తులోని జీవం
మొలకై మొక్కై మహావృక్షమై
విస్తరించాలంటే...తరించాలంటే-

లోపలనుంచి బయటపడాలి...
తొమ్మిది నెలలకైనా
తొమ్మిది అలలనైనా
నెమ్మదిని దాగిన కలలనుంచైనా!

లోపలే లేనిది
బయటికెలా వస్తుంది?

కవిత్వం

రాలేదంటే ఏదో
లోపభూయిష్టం!

నీళ్ళు...కన్నీళ్ళు
లోపలుంటేనే
మబ్బుల్లోంచీ...కన్నుల్లోంచీ
జలజల విలవిల రాలేది

కవీ!
నీ లోపలుంటేనే...
నువ్వు పైకొచ్చేది...
మాగి మంటై మంత్రమై
కాగి తంపటై తంపరై
కాగితం పైకి!

8-5-2016 బుధ,
2-2.39 ఏ.ఎం.

కనబడని శిల్పం

రంగులో...రాగాలో...
రుచీ వాసనలిచ్చే దినుసు
ఆటలో...పాటలో
గమన గమకాలొలికే మనసు!

నిజంగా
రంగుల్లో లేనిదీ
రాగంలో పలుకనిదీ–

వి'లక్ష'ణ విదిలింపులో
స'లక్ష'ణ పలికింపులో
ఒంపుగా ఇంపుగా ఒదిగిపోతూ
కనసొంపుగా...వినసొంపుగా
మనసును కదిలించేది – అదీ!

కవిత్వం

అందుకే సంస్మరణ
పోయిన మనిషి రూపంలో
శిలీభవనం చెందితే
నాకసలు నచ్చదు

రంగులోనో
రాగంలోనో
క్షరం కాని వరంలోనో-
ఒక్క మాటగా వర్ణంలో
కనబడకుండా
ఒంపుగా...ఇంపుగా
కనుల సొంపుగా
కనబడని అంశమై
శిల్పీభవిస్తే గానీ నచ్చదు
నా మనసు మెచ్చదు!

అంతరంగాన్ని
అంతరంగాల్లో
రసతరంగితం చేసే
కళలాగుండాలి
మరణానంతరపు స్మరణ...
సంస్మరణ!

13-7-2016:బుధ
6.20-6.25 ఎ.ఎం

(అవధానుల మణిబాబుగారి వ్యాసం 'స్మృతులు-అనుభూతులు' చదివాకా ... అది వేసిన మనోముద్రకు అక్షర రూపం)

వ్యష్టి - సమష్టి

మబ్బునుండి విడివడి
స్వేచ్ఛగా...
రోదసిగుండా పయనిస్తూ
ధీమాగా...
చిన్మయ మందహాసం చేస్తూ
చినుకు!

జారింది
ప్రవాహంలోకి...
కోల్పోయింది
చిరునామా.

బాధపడింది.

ప్రవాహం నుంచి విడివడలేక

కవిత్వం

బంధింపబడి
నదిలో భాగమై పయనిస్తూ
సమూహమై
చిందులేస్తూ కదిలి సాగింది!
సంతోషపడింది.

అస్తిత్వం కోల్పోయినా
ప్రవాహ గమనమైంది!

వ్యష్టి సంకుచిత్వం నుంచి
సమష్టి చైతన్య తత్త్వంగా వికసించింది!

విస్మరణీయం కాస్తా
సంస్మరణీయమైంది!!!

31-7-2016:ఆది
7.20 - 7.30 ఎ.ఎమ్

గగనం - ఖగనం

గగన ఉద్యానవనం
ఉద్యానవన గగనం

చెల్లాచెదరుగా కదిలే
వింత కాంతుల మేళవింపులు
అలనల్లన సాగే రంగుల పూలై
గగనాన్నే ఉద్యానవనం చేస్తాయి.

గాలితో పాటూ అటూ ఇటూ
లయబద్ధంగా ఊగే
వికసించిన నక్షత్రాలు
తోటనో గగనం చేస్తాయి.

నాకగుపడే సంధ్యా దృశ్యం
పైన రంగులద్దిన

కవిత్వం

మేఘాలతో తేలిసాగే గగనం...
కింద రంగు రంగుల
పూలతో పులకించే తోట...

నా గది కిటికీ తెరిస్తే...
నా మనమంతా గగనం!
నా గమనమంతా ఖగనం!!

గగనం ... ఖగనం!
మనం ... గమనం!!

7-8-2016:ఆది
5.05 పి.ఎమ్

ఈ తరం వైద్యుడు

గుడిలో గోడలు
ప్రార్ధనల ప్రకంపనలతో
పవిత్రమౌతాయా?

అనుమానమే!

కానీ నేను విన్నాను
గాఢమైన ఆర్తిగల
ప్రార్ధనల కంపనాలు
తాకి ప్రతిధ్వనించడం
సుదీర్ఘమైన కారిడార్లలో...
కాలి దార్లలో
ఆసుపత్రుల వార్డులలో...
నిట్టూర్పుల వేడ్పులలో!

కవిత్వం

అక్కడ వైద్యుడున్నాడనే...
ప్రాణం పోసే దేవుడతడనే!

ఇదంతా ఒకప్పుడు ...
నా చిన్నప్పుడు!

గుళ్ళో దేవుడు మూగాడై
ప్రార్థనలు విన్నదెపుడూ లేదు.

ఆ రాతిదేవుణ్ణే
అనుక(స)రిస్తున్నాడు
గుండెను రాయి చేసుకున్న
ఈ తరం అపర వైద్యుడు...
నిరంతరం డబ్బు కక్కుర్తి నైవేద్యుడు!

11.1.2017, బుధ
2.25 ఏ.ఎం

చిలిపి ఆక్రోశం

అర్ధరాత్రి నిద్దట్లో
పాస్ పాసంటూ నాన్నను లేపే చిన్నారిని–
"నాన్న నీకేం చేశాడురా?!"ని
ఒక చిలిపి ఆక్రోశం ప్రశ్న!

"నాన్న ఈ అమ్మను పెళ్ళాడాడు".

సమాధానం వింటూ
లేత బుగ్గపై ముద్దయిన
ప్రేమానురాగాల ముద్ద!
సింగార రాసిక్యాల ముగ్ధ!!

(పదేళ్ళ తర్వాత ఈ రోజూ ఒక జనవరి బుధవారం
కావడం విశేషం)

18.1.2017బుధ
3.22 ఏ.ఎం

ఇంటికి జ్వరమొచ్చింది

ఇంటికి జ్వరమొచ్చింది!

ఊరే కన్నీళ్ళతో
కారే చిరుజల్లుతో
ఇంటికంతా పడిశం పట్టేసింది.

మూసిన కన్ను తెరవక
మూడు గంటలైందేమో...
ఇల్లు దిగులు జల్లులో తడిసిపోయింది.

మా ఇంటికి జ్వరమొచ్చింది!

అప్పుడప్పుడూ
మాగన్నుగా తెరచిన కళ్ళనుంచి
దూసుకొచ్చే చూపులు

గన్నులై హేండ్సప్ అటెన్షన్లోకి
అందరినీ నెట్టేస్తున్నాయ్...
వజవజ గిజగిజలాడుతోంది ఇల్లు!

ఆటబొమ్మలకు ఊదే ప్రాణశక్తి
నిస్త్రాణంగా...నిరీహం కాగా
మూలుగుల నీరసపు నిట్టూర్పుల్లో
ఎముకల మూలుగులన్నీ నిర్వీర్య మౌతున్నాయి.

ఆకలా, దాహమా... రుచిలేని
దాకలు ఖాళీ కాలేదు;
చీకటా, పగలా... వెలుతురు
చీకిన లాలీపాప్‌లా కాలం కరుగుతోంది!
అంతా, అంతటా గప్‌చుప్...
ఛుక్ ఛుక్ రైలుకు ఆక్సిడెంటైంది!

మూడు వత్సరాల బాల్య నిత్య చైతన్యం
మూడంకేసి ముసుగేసి పడుకొంది.

అందుకే-
మా ఇంటికంతకీ జ్వరమొచ్చింది!

ఇంటిల్లిపాదీ వణుకుతోంది...
బెంగ చలితో ముణగదీసుకుని
వజవజ గిజగిజలాడుతోంది ఇల్లు!

26.2.2017 ఆది
3-3.55 ఎ.ఎం

కలి'విడి'తనపు విడిది

ఉన్నట్టుండి
మూగాడైపోతాడు!

అప్పటిదాకా
అందరితో(లో)నూ కలివిడిగా ఉన్నవాడే...
విడిపోయిన ఆలోచనల దారం
చిక్కుల్లో చిక్కుకుపోతాడు.

ఇంకా వల నెయ్యాలి
అప్పుడు వెయ్యాలి...గుప్పెడు పట్టాలి
అంతా నిగనిగల తళతళల ఈదులాట!

చుట్టూ సమూహపు సందోహం
అదంతా మనసులోపల
ముసురుకున్న సందేహం

సందేహాల దేహాలెన్నో
వలలో బిలబిలా పడతాయ్!

ఏవి బాగున్నాయో
వేటి ఉనికి అందగిస్తుందో
వాటిని ఏరుకుని మిగతావి వదిలేస్తాడు

ఏరినవాటి తలకట్లు సవరిస్తాడు
మేనంతా తడిమి తడిమి పదార్చనమౌతాడు
మేలైన ఇమేజరీ జరీ చీరలు కట్టబెడతాడు

తనలో తాను గొణుక్కుంటాడు
సమూహంలో ఏకాకి అయిన
ఏకాకి సమూహం కదా ఎంతైనా!

సృజన గట్టున వేసిన వలకి
ఎప్పటికో పడుతుందొక కవితామీనం!
ఆగుతుంది సందేహ సందోహాల యానం!!

పొర్లుతుంటాయి ఏకాకి క్షణాలు
దొర్లుతుంటాయి ఏకాకి సమూహపు అంత:వీక్షణాలు
కలి'విడి' తనం కలిసి విడిది చేస్తుంది మళ్ళీ....
కవితను వినిపిస్తుంది త్రుళ్ళి త్రుళ్ళి!

26.2.2017 ఆది
4-4.10 ఎ.ఎం

ఏకధృవం....

తృతీయ ప్రపంచాన్ని
అద్వితీయంగా లొంగించుకుంటూ
ఏకైకం అయింది...
ఇప్పుడు ఏకధృవం ప్రపంచం!

తృతీయ ప్రపంచమంతా
అద్వితీయంగా తిరగబడే రోజు కోసం
ఏకమౌతుంది....
అప్పుడూ ఏకధృవమే ప్రపంచం!!

27.2.2017 సోమ
4.30 ఎ.ఎం.

నమ్మాలి...

ఎక్కడా?
కనిపించదేం!

అతడో కాంతి పుంజం....
నిలువెత్తు వెలుగు తేజం.

అయినా –
ఎక్కడా?
కనిపించదేం!

ఆకట్లో ... పెనుచీకట్లో
రోకట్లో తల పెట్టినవారికి
వెలుగులు పంచుతూ...
అతడో దీపధారి!

కవిత్వం

దీపం వెనుక చీకట్లో
రూపం తెలియనివాడతడు–

అన్న వస్త్ర గృహార్తుల
అణ్వస్త్ర స్పృహా ధూర్తుల
మార్గంలో ఒకే వెలుగులు పరుస్తాడు!
భుజం చరుస్తాడు...పాపం, ఏ
ఇజం లేనివాడతడు!

వెలుగులో ఎవడూ ఏ తప్పూ
చేయడని...చేయలేడని
బహుశా అతని నమ్మకం!

నమ్మకం పక్కనే ద్రోహం
నక్కి ఉంటుందనీ నమ్మాలి.

3-3-17 శుక్ర
5.45 ఎ.ఎం

ఋణం

నవమాసాలూ మోసి
కన్నాననుకుంది తల్లి!

నవమాసాలూ రోసి
తల్లిని చేశాననుకుంది బిడ్డ!!

తల్లీ, బిడ్డా
తమకు తెలీకుండా నాకో
గొప్ప వరం ఇచ్చారు...
నన్నో నాన్నను చేశారు!!!

3-3-17 శుక్ర
6.40 ఎ.ఎం

పుటుక్కు జరజర...డుబుక్కు మే!

పుట్టుకకు ఆయత్తమైందగ్గర్నుంచీ
నిన్ను వెంటాడుతూనే ఉంది.

నీ నీడైనా
చీకట్లో నిన్నొదిలేస్తుంది గానీ–
అక్కడా నీ వెంటే ఉంటుంది...
నిన్ను కౌగలించుకోవాలనే సుమా!

'చిక్కదు...దొరకదు'లా నువ్వు
'కదలడు...వదలడు'లా అదీ
దోబూచులాడుకుంటూనే... ...

బాల్యపు మైదానాలు దాటీ
యౌవనపు కొండలు ఎక్కీ
కౌమారపుటుద్వేగాల నదుల్లో ఈదీ...

అందకుండా పోతుంటావు
ఎప్పటికప్పుడే...ముప్పుతిప్పలు పెడుతూ!

అయినా నిరంతరం
నీ వెంటే...పడుతూ వెనకే...

లింగభేదమేమీ లేదు – ఒక్క
ఆలింగనం కావాలనే ...
వయోభేదమసలే లేదు
ప్రియాతి ప్రియంగా నీతో మసలాలనే ...

సమయం సందర్భం
కలిసిరాక పాపం,
ఎంత మరణయాతన పడుతుందనీ!

యాతనైనా ... అయినా
నీ వెనువెంటే అనుబంధపు జాతరౌతూ
నిన్ను స్పృశించాలని... అంతే!

యౌవనపు కొండలమీంచి
నీకు తెలీకుండానే
వృద్ధాప్యపు లోయలోకి జారిపోతావు
'పుటుక్కు జరజర దుబుక్కు మే'!

జీవితమంత మరణయాతన పడితేనే గానీ

కవిత్వం

మరణం గెలువలేదు నీపై!
ఒక్కసారి గెలిచాకా, నిన్నొదిలేస్తుంది ఆపై!!

కానీ ఇదంతా ఎందుకో తెలుసా?
దేహ పంజరపు పాంచభౌతికాలను
విశ్వైక పంచభూతాలలో కలపాలని...
నిర్వాణ గగనంలో నిన్ను నిలపాలనీ...
ఆత్మీయంగా!!!

జీవితమంతా రణం!
మరణయాతన పడుతుంది మరణం!!

4-3-17 శని
4.33-4.41 ఎ.ఎం

లోకాన్ని మిగుల్చుతాయి మరే!

పుట్టి, పెరుగుతూ చదువుకుని
ఏదో ఉద్యోగంలో ఇరుక్కున్నప్పుడే
పదవీవిరమణ ఎప్పుడన్నది తెలిసినట్లే...
పుట్టి, పెరుగుతూ నేనూ నాదనుకునే
జీవితవిరమణ సమయమూ
తెలుస్తుంది, నీకు కాకపోవచ్చు!

పుట్టినప్పుడే మరణమెప్పుడో
విధికి తెలిసిన ప్రీ-ప్రోగ్రామింగ్!
ఆ విధంగా నడుమ జీవితమో కాలక్షేపం!!

జీవితమో కాలక్షేపం సరే...
ప్రతిదానికీ చివరనేది తప్పనిసరే...
కానీ ఇంకా కాదు కదా!
కొంత కాలం నీదంటూ మిగిలే ఉంది మరి.

కవిత్వం

జూదపునేస్తం కాలం...
చేతిలో పేకముక్కల మాయాజాలం!
గెలుపు ముక్కల్ని ఎంచుకోవడమే కాలక్షేపం!!

మన శరీరాన్ని, తెలివిడినీ
వ్యర్థం చేస్తుంది కాలం...
అది దాని నైజం!

కాలాన్ని వ్యర్థం చేస్తే
చెప్పేదేమిటి, తిరోగాములం...
ఇదీ జీవించే బ్రతుకు నిజం!!

గడియారాన్ని నాడికి కింద కట్టిపడేసి
కాలాన్ని నీదాన్ని చేసుకుంటే
నీ అడుగులన్నీ మునుముందుకే...
కాదంటే, పైపైకి!

ప్రతీదీ గతిస్తుంది, జీవితంతో సహా...
కానీ పూర్తిగా కాదుగా స్వాహా!
యత్నిస్తే...యాత్రిస్తే...నియంత్రిస్తే...
ఇస్తే...ప్రేమిస్తే...సేవిస్తే...
నీవైన గొప్ప పాదముద్రలు
గతించక మిగిలే ఉంటాయి...
నీ లోకాన్ని మిగుల్చుతాయీ లోకంలో!!

4-3-2017, శని
4.30-4.44 పి.ఎం.

నేనో గొప్ప జూదం

నేనో జూదగాణ్ణి.

హార్స్ రేస్‌కు వెళ్తాను
రమ్మీ రంజుగా ఆడతాను
సంపాదించాలనే కసి నేనే!

మూడు పూలొస్తే
ఆరు కాయలు పోయేవి.

సంపాదించిందేమీ లేదు
వ్యసనపరుడిననే చెడ్డపేరు తప్ప!

నన్ను ఓటమి పాల్జేసిన
'ఎవర్ విక్టర్' గుర్రానికి
రేసును విజయం చేసే యత్నంలో

కవిత్వం

కాలు బెణికి మల్టిపుల్ ఫ్రాక్చరైతే
దిగులేసి వైద్యం చేశాను.
నేనో పశువైద్యుణ్ణి లెండి!

అది కోలుకుని మళ్ళీ పరువులు తీస్తుంటే
ఏదో చెప్పలేని ఆత్మ సంతృప్తి!

ఆ సంతృప్తి వెదికిపెట్టింది
సమాజపు ఎరీనాలో పరువు పెట్టలేని
అనాథలను అశాంతులను అభాగ్యులను...
నా చుట్టూనే ఎందరెందరో!

జూదగాణ్ణిగా...
సేవాగుర్రం ఎక్కాను నేనే జాకీగా!

ఉన్నంతలో, నాకున్నంతలో
పది మెతుకుల్లో రెండు విదిల్చాను
రానురాను అదో బాధ్యతగా
దేవుడి పూజగా మది తల్చాను

ఆశ్చర్యం...
పూజకో మూడు పూలు ఉపయోగిస్తే
మోజుగా రాల్చింది
ఆరు కాయలు సమాజం చెట్టు!
ఆజానేయమైంది సేవాగుర్రం!!

ఏతావాతా తెలిసిందేమంటే...
సేవో గొప్ప గెలుపు జూదం!!!

(ఆజానేయము= the best breed of horses)

(నిష్కామంగా సమాజసేవ చేస్తున్న వారందరికీ...)

4-3-2017, శని
4.46-4.58 పి.ఎం.

కవిత్వం

విరూపం కురూపం అయితేనే ...

చుట్టుముట్టి
తరుముతుంటే
ఒకటే విలవిల.

సుతిమెత్తని ప్రతీక
అందానికెత్తిన పతాక
సున్నితత్వాన్ని మృదుత్వంతో
మెదిపి చేసిన రసాయనం
సృష్టి రంగులన్నిటినీ
విరజిమ్మే ప్రాకృతిక పర్యవసానం...

విచ్చుకుంటుంటే
నెమ్మది నెమ్మదిగా
చుట్టిన ఆవరణంలోకి-

రేకుల బాకుల
మృదు మంజుల తాకిడికి
కుంచించుకుపోతూ
తట్టుకోలేని విరూపమై...
విలవిలలాడుతోంది శూన్యం!

వికసించే శబ్దం సముద్రమై
పోటెత్తి ముంచుతుంటే...
తట్టుకోలేని కురూపమై
విలవిలలాడిపోతోంది శూన్యం!

విరూపం, కురూపం అయితేనే శూన్యం
అందంతో ఆనందంగా విరుస్తుంది కుసుమం!

9-3-2017, గురు
11.15 ఎ.ఎం.

జలజపుష్పం

జలపాతమై దూకిన ఉద్వేగం
సమతలమై మిగిలిన ఉరవడితో
కొత్త స్నేహాలను మోహాలను పాయలుగా
చిత్తమొచ్చినట్లుగా కలుపుకుంటూ
చుక్కలుగా ధారలుగా కుండపోతలుగా
మొక్కల పంటలను మోసుకుంటూ
ప్రవాహమై సాగుతూ వస్తే
ఆనకట్టవై నియంత్రిస్తావు
జలజ పుష్పంతో
దీపాలు వెలిగిస్తావు.

మనిషీ! నువ్వూ ఒక నదివే
తనిసి మురిసే ప్రవాహానివే
కానీ ఏ ఆనకట్టలూ లేకుండా సాగుతావు
ప్రసాదింపబడిన జీవితప్రవాహాన్ని

చైతన్య ప్రవాహ జీవనంగా మలచుకుంటే ...

నువ్వూ –
ఒక నదివే
మనిషీ...
జలజ పుష్పమే ఔతావు
మనీషీ!

27.3.17 సోమ
3నుండి 3.17 పి.ఎం

చింతేల?

తప్పానని చింతేల?
తప్పాలి; తప్పే తీరాలి!

అప్పుడే
కొత్త దారులు కొలుస్తావు
క్రొంగొత్త తీరాలు చేరతావు!

గహనాటవుల్లోనైనా...మన:
కుహరాంధకార గుహల్లోనైనా!

18.7.2017 మంగళ
12 పి.ఎం

బాటతోబాటే...

రేరాణి తలనిండా పూలతో
చిగురుబోడిలా నిలుచుంది

నా గది కిటికీలోంచి
అగుపడిన అపురూప దృశ్యం
దేహమంతటా పాకిన పారవశ్యం
ఆ పూల పరిమళంతో!

తెల్లారి చూస్తే...
తెల్లారిన జీవితంలా
పువ్వులన్నీ రాల్చేసి
బోడిగుండుతో బోసిపోయింది

బాటేమో పువ్వుల్ని అద్దుకుని
నేలమీది ఆకాశంలా మరో దృశ్యం

కవిత్వం

గుండా పోతున్నవారి గుండెల నిండా
గుబాళింపులు పొదువుతోంది

ప్రాణం లేనిదే బాట-
రాలిన పూలను
మేనున దాల్చిన పారవశ్యాన్ని
గమకాలుగా అనువదించుకుని
సుగంధ గానం చేస్తోంది
అటు ఇటు పోయేవారిని ఆహ్లాదపరుస్తూ!

పారవశ్యం ఒకటే...
ప్రతిస్పందనలోనే తేడా!

సిగ్గుపడుతూ పోయి
నిల్చుని బాటతోబాటే
నేనూ అందుకున్నాను ఆ పాటే!!

1.9.2017:శుక్రవారం
5.40 ఎ.ఎం

మనిషి చిగురించడేం?!

తుఫానులమీద తుఫానులు
వస్తున్నయ్...పోతున్నయ్!

పెళ్ళగించబడి కొట్టుకుపోయినా
మళ్ళీ మళ్ళీ చిగురులేస్తుంది పచ్చదనం

తుఫానులెన్ని వస్తేనేం?
కథనులెన్ని పరిస్తేనేం!

మనిషి చిగురించడేం?!

(అక్టోబర్, నవంబర్ నెలల్లో మూడు పెనుతుఫానులు
రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం
చేయగలవన్న వార్తకు...)

30.3.2017:శనివారం
5.24 ఎ.ఎం

కొత్త బట్టలు

పుట్టినప్పటి బట్టని వదిలేసి, ప్రతి
పుట్టినరోజుకూ...పండుగలకూ
కొత్త బట్టల్లో మెరవాలనుకుంటావు

కానీ–
ఆ కొత్త మడతలు వెనుక
పడుతున్న కాలం ముడుతలు
కనిపిస్తూనే ఉంటాయి

ఆ ముడుతల కొలతలు
ఎప్పటికప్పుడు తీసుకుంటూనే...
ఉంటుంది మృత్యువు

మరణవస్త్రాన్ని నేస్తూ
అంతిమంగా నువ్వు ధరించగల

క్రొంగొత్త బట్టలు కుడుతుంటుంది

అచ్చం పుట్టినప్పటి డ్రెస్సులానే
ఉంటుందది–
కొలతలకు అమరిన అనాచ్ఛాదితం!

(నోబెల్ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ స్వీడిష్ కవి
టోమస్ ట్రాన్స్‌స్ట్రోమర్‌కు కృతజ్ఞతలతో...)

30.3.2017:శనివారం
5.39 ఎ.ఎం

పోరాటం

బిగిసిన దవడ కండరం
బిగించిన ఉక్కు పిడికిలి

చెక్కేసినా పోరాటపు
ఆకాశంలో మెరుపు కొరడా! ...
ముంజేతిని నరికినా
కత్తి పట్టును వీడని సాయుధ చిహ్నం!

ఆరాటమో...
పోరాటమో...
ఈరోజు, కాపోతే రేపు
అవును, ఎప్పటికైనా
జయిస్తుంది!

8.10.2017 ఆది
4.30 పి.ఎం

సుద్దుల మాటలు

పాలు డాబా ఎక్కుతాయి
టీచర్ ఒకటో తరగతిలోనే ఉండిపోతుంది
ప్రసాదాన్ని చీమలు కరుస్తాయి
రోజులన్నీ ముఖ్యమైనవే అవుతాయి!

వేణుగానం వీణానాదం ఏపాటి?
గిటారు గేయం సితారగీతం, అవా సాటి!

అమ్మ స్నానం చేస్తూ
పొయ్యిమీద పాలకి కాపలా పెడితే
మూడేళ్ళ పిల్లాడి ముద్దు మాట–
'పాలు డాబా ఎక్కేస్తున్నాయి!'
ఈ మాటముందు వేణుగానం వెలవెలబోదా?!

రెండో తరగతిలోకి ప్రమోటైన

కవిత్వం

అమ్మాయి దిగులు
'టీచర్ ఒకటో తరగతిలోనే ఉండిపోయిం'దంటే–
ఈ మాటముందు
వీణానాదం విలవిలలాడదా?!

చీమలు మూగడం చూసి
'ప్రసాదాన్ని చీమలు కరిచేస్తున్నా'యంటే–
ఈ మాటముందు గిటారుగేయం గిలగిలలాడదా?!

క్యాలెండరు అంకెలన్నింటినీ
ఎర్ర రంగుతో చుదుతున్న చిన్నారినడిగితే
'రోజులన్నీ ముఖ్యమైనవే కదా'ని విస్మయపడితే–
ఈ మాటముందు సితార గీతం చిన్నబోదా?!

అమాయకపు చిన్నారుల
ముద్దుమాటల తీపి ముందు
వేణుగానం వెనకవుతుంది
వీణానాదం విస్తుబోతుంది
గిటారు గేయం గాయపడుతుంది
సితార గీతం గింజుకుంటుంది

ముద్దులొలికే
ఊరగాయ మాటలు
విననివాళ్ళకే...వాళ్ళకే

వేణుగానం వీణానాదం
గిటారు గేయం సితార గీతం
తియ్యగా ఉంటాయి

బిడ్డల ముద్దుల మాటలు
తియ్యని సుద్దుల మూటలు!

(పాలు డాబా ఎక్కడం – మా మేనల్లుడు ఫణీంద్ర కుమార్ డిస్కవరీ ... టీచర్ ఒకటో తరగతిలోనే ఉండిపోదం – మా అమ్మాయి సౌమ్య దిగులు ... ప్రసాదాన్ని చీమలు కరవడం – అవధానుల మణిబాబుగారి పాప సాహితీ సాలంకృత మాట... క్యాలెండర్ అంకెలన్నీ ఎరుపు చున్నాలు చుట్టడం – డా॥ మక్కెన శ్రీనుగారి అమ్మాయి మేఘన చేత)

28.12.2017 గురు
2.32 ఎ.ఎమ్

అసలు సిసలు కవిత్వం

రక్తానికీ ఎముకలకూ కోమా
సామాజిక స్ఫూర్తికి కామా;

ఆలోచన మనసుకిచ్చి
భావాన్ని హృదయంలో తంపటేసి
కలాన్ని చేతికివ్వాలి.

మంచి కవిత్వాన్ని చేదుకోవాలి
మనిషితనాన్ని ఆదుకోవాలి!

మనిషితనాన్ని నిలిపే సవిత్వం ...
అదే అసలు సిసలు కవిత్వం!

28.12.2017 గురు
2.54 ఎ.ఎమ్

జ్ఞాపకాలు

ఒకటొకటే
తీగలా సాగాలి
ఉపనదుల్ని కలుపుకున్నట్టూ
సాగుతూ సాగుతూ
మన:మైదానాన్ని సారవంతం చెయ్యాలి
బతుకు నదిగా ప్రవహించాలి

ప్రయాణం
గవాక్షపు దృశ్యంలా ఉండాలి
బతుకు పయనం సాగాలి

తీగెలా సాగాలి జ్ఞాపకాలు.

నాస్టాల్జియా అనుకుంటాం గాని
జ్ఞాపకాలే కదా

కవిత్వం

కొత్త దారుల్ని చూపే చక్షులు
బతుకుదారి చీకటైతే
వెలుగిచ్చే కాగడాలు!

జ్ఞాపకాల దారపు లింకు
తెగిపోతే–
బతుకు గాలిపటం ఎగరదు.

అందుకే–
జ్ఞాపకాలు ...
గవాక్ష దృశ్యంలా సాగాలి
నదిలా ప్రవహించాలి
గాలిపటంలా ఎగరాలి.

జ్ఞాపకాలు శిలీభవిస్తే
మరణం కాక మరేమిటి?
ఘనీభవించిన జ్ఞాపకం
జీవం లేని వ్యాపకం!
బధిరాంధ నిరూపకం!!

15.10.17 ఆది
3.00–3.23 ఎ.ఎం

దృశ్యం

ఆనందంతో చెమర్చే అందరి కళ్ళు
కార్చే అశ్రుబిందు ముత్యాల జల్లు

కథ ఏదైనా
ఒక దృశ్యం.

మంగళ వాయిద్యాల హోరులో
ముత్తైదువుల కనుసన్నల్లో
శిరసులను అదిమిపట్టిన అరచేతులు
కథ ఏదైనా, ఒక కమనీయ దృశ్యం.

సిగ్గుతో తలొంచుకు కూర్చున్న
సాలంకృత మెడలో పడే
మూడు ముళ్ళ ముచ్చటైన బంధం
కథ ఎవరిదైనా, కమ్మని దృశ్యం.

కవిత్వం

తెల్లని ముత్యాలు
నల్లని కురులమీదుగా సుతిమెత్తగా జారుతూ...
అవే ఎర్రగా అవే నీలంగా మారే క్రమం
కథ ఎప్పటిదైనా, కనుల విందయే దృశ్యం.

కొంగులు రెండూ ముడిపడి
అరుంధతమ్మ ఆశీర్వాదం కోసం చేసే నమస్సులు
కథ ఎక్కడిదైనా, కనులు చెమర్చే దృశ్యం.

పొట్టితనం మునివేళ్ళ మీద కాళ్ళెత్తి
పొడుగుదనం మెడలో వరమాల వేయడం
కథ ఎందరి సమక్షంలోనైనా,
కనుల పండుగయే దృశ్యం.

సప్తపదుల నడకే కాదు;
సప్త పదుల వాగ్దానాల నడతనూ
ఆదానప్రదానం చేసుకునే సందర్భం
పూరుషార్థ సాధన మొదలుపెట్టే సమయం
ఏ జీవిత కథకైనా, పరమార్థమయే దృశ్యం.

ఆనందంతో చెమర్చే అందరి కళ్ళు
కార్చే అశ్రుబిందు ముత్యాల జల్లు
కురిసే మానవానుబంధాల దృశ్యం!

13.2.2018 మంగళ
శివరాత్రి 4.20 పి.ఎమ్

(టి.వి.లో పార్వతీకళ్యాణం చూస్తూ...)

3.02.2018

పద్యాలై పలకరిస్తూ వస్తాయి ...
కవితలై రెక్కలల్లార్చుతూ వచ్చి
ఒడిలో వాలి కువకువలు పోతాయి...
నా విచికిత్సకు చికిత్స చేస్తూ
వ్యాసవిన్యాసాలై వచ్చి చేరతాయి

ప్రతిరోజూ కొన్ని కొన్ని అక్షరాలు
పుస్తకగుచ్ఛాలై పులకరింపజేస్తాయి
పుష్పగుచ్ఛాలంతగా తావులీనుతూ
నేనిష్టంగా గడిపే తావు జేరతాయి ...
పూరేకుల్లాంటి పుటల మెత్తని బొత్తులు
సాహిత్యాన్ని మోసుకొచ్చే ఊపిరితిత్తులు

కానీ ఈ రోజు
ఆప్యాయతాక్షరాల గుచ్ఛం ఒకటి –

కవిత్వం

మావికొమ్మ నల్లుకున్న
మౌనమైన 'మాధవీ'లత మాటున సొక్కి
కలకూజితాల కలవరింతలై
ఐదేళ్ళ 'విజయ'వ్యాపార చిహ్నంగా
చేతుల్లో భారంగా చెంగలించింది.

పోయినేడు ఇదే రోజుల్లో
ప్రాభాతాన పలకరిస్తూ కాలం నెచ్చెలి
నా రక్తాన్ని పోటెక్కించింది...
కొత్తసంవత్సరం క్రొంగొత్త రీతిలో
ఔషధసేవను బహుమతి చేసింది

అయినా, కాలం నెచ్చెలి కదా,
ఎప్పటిలానే కలంలో సిరాయై
తెల్లని కాగితాల్ని నల్లగా
నల్లని అక్షరాల్లో తెల్లని భావాలుగా
పలికించింది నాచేత చేతనత్వమై!

ఈ రోజు దైనందిన కార్యకలాపంగా
కొన్ని అక్షరాలను నాటి వచ్చేసరికి
చేతుల్లో భారంగా చెంగలించిన
ఆప్యాయతాక్షర పుస్తకగుచ్ఛం
నా గ్రంథాలయం పాత అరల్లో
'పోయిన' కాలాల సాహితీహితుల సరసన
మూడొందల పుటల వెన్నెముకతో

ముద్దులొలుకుతూ నిటారుగా నిలిచింది
నా వెన్నెముకను దృఢపరుస్తూ
నన్నువారి మధ్య నిటారుగా నిలిపింది.

ఈ కొత్త సంవత్సరం
మరీ క్రొంగొత్త బహుమతి తెచ్చింది
'మాకినీడి రచనలా సమగ్ర పరిశీలన'
పాత అర మావికొమ్మ నల్లుకున్న
మౌనమైన 'మాధవీ'లత
నన్ను పదికాలాలు నిలిపి ఉంచే
ఔషధమై ... ఔద్ధత్యమై!

(డా॥ ఇరపనేని మాధవి గారి (అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య
నాగార్జున విశ్వవిద్యాలయం) పర్యవేక్షణలో
శ్రీ వ్యాపారం విజయకుమార్ చేసిన పిహెచ్.డి
థీసిస్ 'మాకినీడి రచనలా సమగ్ర పరిశీలన' అనే
322 పుటల పుస్తకగుచ్ఛాన్ని అందుకొన్న ఆనందంతో...)

4.02.2018 ఆదివారం
12 పి.ఎమ్

పాడు జాతి మనదని...

స్వచ్ఛాంధ్ర...చదువులాంధ్రని
వార్షికంగా ప్రతి ఉగాదినాడు
గర్వంగా గొంతెత్తి పాడే
కవి కోకిలను కాను నేను!

పాలుగారే పసి పాపాయిలు
తల్లి సందిటే వీడని చంటోళ్ళు
తల్లిభాషను కుబుసంలా వదిలేసి
ఎంగిలి నాలుకతో చదవాలని శాసిస్తే...
నవ్వూ ఏడ్పూ ఇంగ్లీషులోనేనని పీడిస్తే–
నిద్రే పట్టని గొంగళికి రెక్కలు మొలుస్తాయా?
ఎగిరే రంగుల కలలు నిలుస్తాయా?!
ఎలుగెత్తి చాటడానికేముంది?

నారాయణ ... నారాయణ

నేనేమని పాడగలను?
తెలుగు భాష మాధుర్యం
ఎలుగెత్తి ఎలా చాటగలను?
మేరా టెల్గూ వెరీ స్వీటంటూ
కోరి కోరి ఎలా ట్వీటగలను?

మాధ్యంగా తెలుగును చంపేసి
నిలువెత్తు గోతిలో పాతేసి ఏడాదైంది.
అందమైన సమాధి కట్టేసి, పైన
ఇంగ్లీషు బడి సొగసుగా కట్టాం, రమ్మంటే...
పసికూనలు పరవశించే
పాఠాలు చెప్పమంటే-

తెగులని దిగులుపడే
తెలుగు భాష మాధుర్యం
ఎలుగెత్తి ఎలా పాడగలను?
పరాయిచీడ పట్టిన
తెలుగు భాష గొప్పదనం
నినదించి ఎలా చెప్పగలను?!

ఇప్పుడు అట్టహాసంగా జరిపే
ఈ తెలుగుభాషా సంబరాలేమిటి?
చంపేసి, తర్వాత పెట్టే
తద్దినమా? తద్భిన్నమా!

కవిత్వం

ముద్ది గిల్లి లాలి పాడినా
ఏడుపు మానడు చంటాడు
నిరసన వెల్లువై కన్నీరవుతాడు
కరిగి నీరయేదాకా మున్నీరవుతాడు!

చంటిపిల్లలమైనా కాకపోయాం;
ఇంటిభాష రక్షణ కోసం
ఏడుపన్నది లేశమైనా లేకుండా
పాడు జాతి మనదని
పాడుజాతి మనదేనని పరవశించిపోతూ–

పాడుకుందాం రండి, రండి...
రండిప్పుడు జరుపుకుందాం
తెలుగుభాషా సంబరాలు!
ఎలుగెత్తి పాడుకుందాం
తెలుగుభాష మాధుర్యం!!

(10వ తరగతి ఫేర్వెల్ సభలో...)

(రానున్న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం–2018 సందర్భంగా...తెలుగు గొప్పతనం గురించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్విజ్ మొ॥ పోటీల వారోత్సవాలు జరుపమని ప్రభుత్వం ఆదేశించినప్పుడు)

17.2.2018, శని
2–3.30,

ఆలోచనలు

పిల్లల్లాంటివే ఆలోచనలు
ఎంతో అవసరం క్రమశిక్షణ

ఆలోచనలు కావాలి
ఆలోకనం, అవగాహనం
అదే ధ్యానం!

జీవితమంతా
ఆలోచనకు సమయమే!!

జీవితం

ముఖానికి
ముక్కు కింద రెండు మీసాలు తగిలించినా
మెడనుంచీ కుచ్చుల జడగా వేలాడేసినా
మెలేయదు విసిరికొట్టదు

ముఖాన్ని
కుసుమకోమల సంశోభితం చేసినా
ముడతల మడతల జరగా మార్చినా
కిమ్మనదు అడ్డు చెప్పదు

చూసే ముఖాలు వేరువేరైనా
దేనినీ తిరస్కరించదు
తన మోముగా మార్చుకుంటుంది

3.10.2017 సోమవారం
2.33 ఎ.ఎం

ప్రకృత ప్రకృతి

పండిన పంటలా నవ్వడం
పండించినోడికి దూరమవ్వడం...
నేసిన గాలిలా రెపరెపలాడడం
నేసినోడినే చుట్టి కఫను కావడం...
ప్రపంచీకరణం!
చీకట్లు పంచే వితరణం!!

కక్కులు కోసిన కొడవలి
కోసిన మెడకే కడమజిలి కావడం...
కుండ సజలత్వం
చేసినోడికే తర్పణం విడవడం...
ప్రయివేటీకరణం!
వేటువేసే ఉపకరణం!!

కవిత్వం

చేతి ఉత్పత్తుల సజీవచేతనం
ఉత్పత్తిదారుల మరణ శాసనం
హస్తకళల హసితదనం
మస్తక ఛేదన
చావుకొచ్చిన కళానిపుణి
ప్రకల్పిత స్వేచ్ఛావిపణి

మెరిసే మెరుపు మెరవడం
ఆ మెరవడం'పైన'నే ఉరమడం
ప్రమాద ఘంటిక!

పూసిన పూవు విరియడం
పూసిన నవ్వునే 'ఉరి'యడం
ప్రమోద ధ్వంసిక!!

ప్రమాద ఘంటికల
ప్రమోద విధ్వంసం...
ప్రకృత సమాజ ప్రకృతి!
ప్రజనన .... వికృతి!!

1.3.18 గురు
3.36-4.36 ఎ.ఎం

ఎందువల్ల?

కోశస్థమై
బహిర్‌ప్రపంచాన్ని తన్నేసి
లోప్రపంచంలోకి ప్రవేశించడంవల్లా ...

కూపస్థమై
శరీర స్పృహను కూడా వదిలేసి
మనసును కూడా లోనికి ముడుచుకోడంవల్లా ...

ఎందువల్ల?

అసహ్యపు రంగునుంచి
ఏడు రంగుల్ని ఆహ్లాదాలుగా చేసి
ఎగురవేయ గలుగుతుంది?

శరీరాన్ని ఏడు రంగుల ఇంద్రచాపం చేసి

కవిత్వం

చూపుల్ని ఎక్కుపెట్టేలా చేస్తుంది!

అయినా, ఆ బాణాలనుంచి
గమ్మత్తుగా తప్పించుకుంటూ
చుట్టూనే తిరుగుతూ
కళ్ళను చక్రాలు చేస్తుంది!

ఎందువల్ల!

ఆకులు బాగా మేసి
మనసు పచ్చగా ఉంచుకోడంవల్లా ...!
హాయిగా మేయగా
హరితాన్ని అవయవాల్లో నింపుకోడంవల్లా ...!!

ఎందువల్ల!
ఎందువల్ల!

21.3.18 గురు
4.30 పి.ఎం

అనేకులుగా...

కొన్ని మాటలు చెప్పి
చనిపోయాడతడు

అతనియందున్న ఆపేక్షతో
అతని మాటల యందున్న మమకారంతో
కొందరు వాటిని పోగేసి దాచుకున్నారు

అతను గుర్తొచ్చినప్పుడల్లా
అతని మాటల్ని తీసి
అటూ ఇటూ తిప్పి
ఓ పద్ధతిలో అమర్చారు.

రకరకాలుగా అమర్చారు
రంగూ రుచీ వాసనల్లో
ఒకే రకంగా ఉన్నవాటిని కూర్చారు

కవిత్వం

ఒకడన్నాడు తత్త్వం బోధించాడని
మరొకడన్నాడు జీవితం శోధించాడని
ఇంకొకడన్నాడు పరమార్థం సాధించాడని

అన్నీ తీసుకుని
ముందేసుకుని
కిందా మీదా పెట్టి
నేను కిందా మీదా అయి
అర్థం చేసుకొన్నదేమంటే-

అతడు రాసింది కవిత్వమనీ...
అందుకే మరణించీ
అనేకులుగా బ్రతుకుతున్నాడనీ!

14.4.18 శని
2.56-2.59 పి.ఎం

ప్రేమ దృశ్యం

తనని తనకే
ప్రేమ ప్రతీకగా ఇచ్చింది

అందరికీ తెలిసిన
రహస్య సంవాదమే–

మడచిన ముంగాలిపై
చాచిన స్నేహ హస్తంతో...
అందించింది.

ఏమర్థమైందో...ఏమో
దళాల చేతుల మీదుగా
సుతిమెత్తని మకరందాన్ని
అందించింది, ప్రతిగా
తీపెక్కిన ప్రేమ

కవిత్వం

దృశ్యమానమైంది
తోటలో గులాబి చుట్టూ
చక్కర్లు కొట్టే మధుపం

మడచిన ముంగాలిపై
చాచిన స్నేహ హస్తం ...
అందిస్తుంది ప్రేమ!

29.6.18 బుధ
3.30 ఎ.ఎం

ఇల్లు

మొదటి బెల్లే
ఇంటి బెల్లు అవుతే
బావుండుననిపించేది...
ఇంటి బెంగ!

ఎన్నో ప్రయాణాల జీవితం...
అత్యవసరంగా పొరుగూరు
వెళ్ళి – బస్సు దిగీ దిగడంతోనే
మన ఊరెళ్ళే బస్సు కనిపిస్తే–
ఎక్కేయాలనిపించేది...
ఊరి బెంగ!

ఊళ్ళో మనదైనది ఇల్లే
ఎక్కడికెళ్ళినా, ఎందూరం వెళ్ళినా
ఇంటికొచ్చేయాల్సిందే!

కవిత్వం

ప్రతి జీవికీ ఇల్లుంటుంది.
ఇల్లు చేరడమే జీవితం!

బయలుదేరిన చోటుకే
తిరిగి వెంటనే వెళ్ళాలనేదే
ఇంటి బెంగ!

ఇల్లు విస్తరిస్తే–
ఊరు; దేశం; ప్రపంచం;
ఇంకా ...

29.6.18 బుధ
3.30 ఎ.ఎం

ఇరుకు బతుకులు

మునుపెన్నడూ చూడని
కొత్తూరెళ్ళాను
మిత్రుల మిత్రుల పెళ్ళి

"ఏమిటో ఈ ఊర్లో
ఏ ఇంటికీ బాల్కనీ లేదు...
కొన్నిళ్ళలో డ్రాయింగూ
సిటింగూ కూడ లేవు..."

స్వగతాన్ని పైకే అనేశాను.

"చూశారూ, మా ఇంటిముందు
రోడ్లెంత విశాలంగా ఉన్నాయో!"
అన్నాడో ఇంటి యజమాని.

కవిత్వం

"అయితే?!"

"దారులు వెడల్పయిన ప్రతిసారీ
మా బతుకులు ఇరుకౌతున్నాయి"

చెప్పాడాయన దిగాలుగా!

2.10.2015, శుక్ర:
10.30 ఎ.ఎం

తెల్లారు...

పడిపడీ
మూసుకుందుకే తహతహ
రెప్పలు

మూతలు పడకుండా
ఆపే శక్తి ఏమిటో!

పద్మా, పుచ్చపువ్వల్లా
విప్పారుస్తుంది
ఎప్పటికప్పుడే!
తెల్లారేప్పటికే!!
లేదంటే
తెల్లారిపోదమే!

25.10.2015 ఆది:
11 ఎ.ఎం

నమో నమో మల్లాడీ!

దూరమైన చదువును
ఎందరికో దగ్గర చేశావు
చదువుకు పేదైనా
నిరుపేదల చదువుకు
చక్కని సోపానమై నిలిచావు!

మోర్మేను రేవులో కళాసీగా
పడవల యజమానిగా
ఎగుమతి-దిగుమతుల వ్యాపారం
మార్మోగగ చేసి
ధనరాశుల తలెత్తుకు బ్రతికి
బడులు గుడులు సత్రాలు కట్టించిన
జీవనభారం ... సాఫల్యసారం!

జాతికి ఉత్తమ మానవ వనరులెన్నో ఇచ్చి -

విఖ్యాతి గాంచిన విద్యాదానశీలీ!
అంతర్జాతీయ విపణివీధి సంపాదనంతా
విద్యకోసం విరాళంగా వితరణచేసి
అంతర్జాతీయపు టెల్లలు తాకిన
ఒక ఎల్లాప్రగడ,
ఒక హాకీ దాసరి మురళీకృష్ణలగ
మలచిన మల్లాడీ!

ఎందరినో డాక్టర్లుగా ఇంజినీర్లుగా
లాయర్లుగా ఉపాధ్యాయులుగా మాన్యులుగా
మరెందరినో విద్యా క్రీడా వైజ్ఞానిక శాస్త్ర
కళారంగాల సమ్మాన్యులుగా మార్చి
సంపాదించిన సిరుల మించిన
విద్యావిరుల పరీమళాన్ని
పంచిన సత్యలింగా!

గురువులకే గురువులు
అద్దేపల్లి గాడేపల్లి
కొండేపూడి విస్సా కేసరివంటి
విద్దె రేదులకు జీవికనిచ్చి
కేజీనుండి పీజీ వరకు
ఎందరెందరెందరో విద్య పొందగజేసిన
ఈవిజోదువీవు!!

తలరాతను మార్చే
ఎలకూతలు వెల రాతలు నేర్పే

కవిత్వం

"కాలేజీకి పోతాన్నాయనా" అంటే
"డబ్బు యాడుందిరా నాయనా" అనే
అభాగ్యపు నాయనల
కన్నారులను చిన్నారులను
'చదువుగడప' తొక్కించిన
భాగ్యమయా నీవు, నాయకరా!

"అన్నదానంతో ఒక కడుపే నిండుద్ది
అక్షరదానంతో నిండిన కడుపు
లక్షల కడుపుల్ని నింపగలద"ని
సంపాదనను 'నిగూఢగుప్తమగు విత్తము'గ మార్చి,
పూరుషాళి రూపముగ కూర్చి
ఎందరినో యశస్వంతులుగా
భోగకరులుగా మార్చిన
'విదేశ సంచిత బంధువు'వయా నీవు!

కపాల మోక్షమందించి
నృపాల పూజితులెందరినో
స్వయాన కాళ్ళమీద నిలచిన
ఆత్మస్థైర్యాలుగ మలచిన
విశాల విశిష్ట దైవతముడవు...

కరాన నరాలు లేని
వదానసములులేని
'పాత్యాంశము'వైన
జీవనవిజ్ఞాన జిజ్ఞాసీ!

చిన్నారి పొన్నారి మానసాల
ఎండిన ఎరీనాలపై
విద్యాగంధపు చినుకులు కురియగజేసి
'ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ 'గ
మలచిన విద్యావారాశీ!

నమో నమో మల్లాడి వంశ మణిదీపమా!
సత్యలింగ నాయక ప్రదీప్తమా!!
నమో నమోస్తుతే!!!



(మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ గారి వర్ధంతి సందర్భంగా జిల్లాస్థాయి కవితల పోటీలో బహుమతి పొందిన కవిత)

10.01.2018
9 నుండి 9.20 ఎ.ఎం

మరణ శాసనం

ఓటమి ఎదురైతే
కౌగలించుకునేవాడు ధీరుడు

ఓటమిని కాదు,
మరణాన్ని!

వాడే రాయగలడు
మ'రణ' శాసనం...

మరణానికి కాదు
ఓటమికి!

03.03.2018
9.08 పి.ఎం

గమనమే గమ్యం

లేకపోతే సమస్యే లేదు!
ఉంటే,
అనుభవాల కోర్కెల రాతిగుట్టలు
పోగుపడీ పడి కొండలౌతాయి.
అక్కణ్ణుంచి చూస్తే ఏముందీ, లోయ!
జీవితం పతనపాతం.

ఉండీ,
అనుభవం జోలికి పోకపోతే
జీవితం చంకలో జోలౌతుంది
లోపల అనుభూతి బీజం
మనసులో నాటుకుంటే–

ఎదురుగా ప్రేమ సంతృప్తి
పచ్చని పెద్ద కొండలా...

కవిత్వం

శిఖరం చేరితే ఆత్మానందం
గుండె సిగలో పువ్వౌతుంది, లేదా
తల శిఖరానికి కిరీటమౌతుంది.

అవకాశం చేజిక్కించుకోడానికీ
గడ్డిపోచలా వదిలేయడానికీ తేడా
తేటతెల్లమౌతుంది
గమనమే గమ్యం!

(ఆప్త ఆత్మీయ మిత్రుడు నాగరాజు కోసం... రాజమండ్రి ఈస్ట్ జోన్ డి.ఎస్పిగా ఉన్నప్పుడు ఒక రోజంతా తనతో గడిపినపుడు చేజిక్కిన అవకాశాన్ని తృణప్రాయంగా వదిలేసినప్పుడు కలిగిన స్పందన)

06.03.2018
9.08 పి.ఎం

ఎదురుచూపుల బెంగ

ఆ దారిగుండా వెళ్తుంటే
చూపులు చటుక్కున తిరుగుతాయి
కలవని చూపులతో శూన్యమై
దిగులు గూడులో రెక్కలు ముడుస్తాయి!

సమున్నతంగా నిలచిన
పై అంతస్తు ప్రాంగణాన్ని
తోరణాల్లా వెలిగించిన చూపులు...

ఎదురేగే ఎదురు చూపుల్లేక
బెదురు గొడ్డులా పడుంది భవనం.

మినుక్కు మినుక్కుమనే రెండు కళ్ళదీపాల
వెలుతురులో అపురూపంగా
ప్రాణం నిలుపుకున్న ఆ ప్రాంగణం

కొడిగట్టి కూర్చుందిపుడు!

ఆ భవనమే నేనై
ఎదురు చూస్తున్నాను
త్రిగుణోపేతమై వెలగాలని...
పాడు పడ్డ ప్రాంగణాన్ని
వేడుకగా మార్చాలని...
దాని బాధను ఏమార్చాలనీ!

(మా మణి పెద్దమ్మ దివంగతురాలైనప్పుడు ...
మొదటి అంతస్తులో కదల్లేని శరీరం చక్రాల బండై,
ఎదురుగా రోడ్డుమీంచి పోతుంటే కళ్ళతో నవ్వుతూ
పలకరించేది!)

అభినందనోద్యానం

ఈ సాయంత్రం...
ఎవరూ రాలేదు!

సాహిత్యం కబుర్లు
పుస్తక గుచ్ఛాలై రాలేదు
ఆప్యాయతల కౌగిలింతలై
గాఢంగా చుట్టుకోలేదు

కవిత్వాన్ని పంచుకునే గంటలు
ఎందుకనో నిస్తేజమయ్యాయి
ఎదురుచూపుల నిమిషాలు
నెమ్మదిగా గంటలై పగలు
క్రమిస్తుండగా పోతూ వగలు...

చిరు చీకట్లు చీకాకులై
పరచుకుంటూండగా...

కవిత్వం

నిన్నటి రోజున
ఆకుపచ్చని తడిగీతాన్ని
వెలుతురు తెరపై
ప్రదర్శించిన అక్షరాలు
అందమైన పువ్వులై గుత్తుగా మారి
చేతిలో వాలింది!

బయట కానుగ చెట్టుపై
గూళ్ళు చేరిన పిట్టల కిలకిలలు
తోడై గదిలో ఉద్యానవనం వెలసింది.

తదుపరి ఆకుపచ్చని తడిగీతం
రూపెత్తిన వెలుతురు తెర ముఖం
పూసిన అభినందనలు విరిసి
చేతిలో పూలగుత్తి చిన్నబోయింది.

అభినందనల పలుకులు విని
పక్షుల కిలకిలలు మూగబోయాయి
పగలు క్రమిస్తూ నాటకీయంగా
ఆకసంలో రంగుల్ని పరచింది
సాంధ్య రాగం వినిపించింది

నాటకీయత తరచూ
ఆహ్లాదాన్ని తెరపై పరచు
దినుసని రుజువైంది

ఈ సాయంత్రం...
నిష్ఫలమనుకున్నాను
కాని...   ...

ఈ సాయంత్రం...హృదయమే
నందనోద్యానమైంది...అభి
నందనోద్యానమైంది!

(సుప్రసిద్ధ కవి బొల్లోజు బాబాగారి కవితాసంపుటులపై రాసిన వ్యాసం అచ్చయినపుడు అచ్చెరువొంది ఆయన ఇంటికొచ్చి అభినందించిన సందర్భం...)

30.05.2018
7 నుండి 7.08 పి.ఎం

శాలినీ బేబీ ... బేబీ శాలిని

పెదాల మందసంలో
దాచిన మందహాసాలే తప్ప
ఏణ్ణర్ధం మాటలు రాపోతే
కొంచెం బాధపడ్డానే అమ్మా!
పలుకుల పటికబెల్లం చిప్పలు
రాలవేమోనని బెంగపడ్డానే తల్లీ!
కానీ అంతలోనే అలవోకగానే కాదు,
గడుసుగానూ మాట్లాడుతున్నావు
గట్టు తెగిన నదిలా నీ మాటల ఝరి

ఒక్కసారే కట్టు తెంచుకు పారింది
నీ చిన్న మనసులో ఊటలెత్తకపోతే
నీ మాటలంత అమృతమొలకబోస్తాయా!
అధరాలగుండా మధుపాతమౌతాయా!!
శాలినీ బేబీ! బేబీ శాలినీ!!

గులాబీరంగు ఇంద్ర ధనుస్సులు రెండు
నారి సారించి లాగి వదులుతావు
శర్కర పూసిన శబ్దశరాలు
ఏడేడు రంగులు పులుముకుని
మా గుండెల్ని సూటిగా తాకుతాయి
హాయిగా వీణియను చేసి మీటుతాయి!

నాట్యం చేసే వేదికా, నీ నాలుక!
స్వరాలకు అందియలు తొడిగి
సరిగమల గంతులేయిస్తావు

నువ్వు పలికితే రాగం
నువ్వు మాటాడితే తానం
నువ్వు పాడకున్నా పల్లవీ
అలవోకగా అలలెత్తి
ప్రతిమాటా గేయమౌతుంది!

మాటకీ మాటకీ మధ్య మందహాసం
పదాల లేసవ్వడులతో
శబ్దాల లేచివురులై
నదాలై నవలెత్తి సాగేను!

ఒక్కోసారి అర్థంకాని నీ మాటలు
తేనెల్లు గట్టిన మూటలు
మరీ మరీ వినాలనిపించే ఊటలు!
ఆరుద్ర కలం వేసే అంత్యప్రాసలు!!

కవిత్వం

శాలినీ ... మధుశాలినీ
నీ ఆరున్నొక్కరాగం కూడా
ఆకాశవాణి ప్రారంభ ప్రసార సంగీతం
ఓ సరస్వతీ వరప్రసాదినీ!
మమ్ము తరింపజేసే పావనీ!!

మాట్లాడవే అమ్మా శాలినీ
మాట్లాడుతూనే ఉండు అలా గలగలా
తెలియరాని కొన్ని నీ మాటలు
తెలియని 'భాషల పుట్టుక'కు పునాదులే...
చిన్నగ మీటేను మా నవనాడులే!

అచ్చులూ హల్లులూ
ఇంకా ఇతరేతర స్వరాలేవేవో
కలబోసి కాపురం చేసే నీ ఆస్యకుహరం
పాణినీ నన్నయల ఆధ్వర్యాన సాగే
భాషావేత్తల నిండు కొలువు!

ఊసుపోని మాకు నువ్వు రాల్చే
ఊసుల పూసల్ని ఏరుకుని
గమ్మత్తు భావాల దారాలతో
మాలలల్లడమే పని...
నీ మెళ్ళో వేయడమే సరి!

ఒక్కోసారి ఎవరూ లేరనుకుని

నీ దరికెవరూ రారనుకుని
నీలో నీవుగా అనుకునే పలుకులు
ఏ కవీ ఎంగిలి చేయలేని చిలుకులు

మాటలకి తగ్గట్టూ తిప్పే చేతి ఒంపులు
సుబ్బులక్ష్మి రాగాల్లోని సొంపులు
వినిపించే గమకాల గుంపులు!

అమ్మ తిట్టినప్పుడో...నాన్న కొట్టినప్పుడో
నిస్సహాయతని అసహాయంగా చూపుతూ
ఒక్కపెట్టున గట్టిగా అరిచే అరుపులు
విశ్వనాథ కవితావిహాయసంలోని మెరుపులు!

అమ్మా శాలినీ!
నీ నోట ఏదైనా రానీ...
అది మాకు చాయ్ ఇరానీ!
మా చేతనల్ని మేల్కల్పే గీర్వాణీ!

(మా మేనల్లుడి కూతురు చి॥ లక్ష్మీ ప్రియదర్శినీ శాలిని ఊరగాయ మాటలకు సంతసిల్లి...)

16.12.2018 ఆది
5 పి.ఎమ్)

కవిత్వం

కవితాభివాదం

ఎంతమందిని చదివానో
అందరూ అన్ని అంశాలూ
చెప్పారు బోధించారు
విశదపరచారు

పద్మవ్యూహంనుంచి
బయటపడే మార్గం చూపించారు

వాళ్ళని లోతుగా చదివేకొద్దీ
నాలోకి జీర్ణమయ్యారు
రక్తనిష్టం అయిపోయారు
వారి కవిత్వంతో...తత్వంతో!

చదివేకొద్దీ...కొద్దిగానో గొప్పగానో
ఎదుగుదల ఎదుగుతోంది

విస్తీర్ణం విస్తీర్ణమౌతోంది

విస్తృతమౌతూ వివృతమౌతూ
సార్వజనీనం...సార్వకాలీనం!

ఎంతమందిని చదివానో
అందరూ అన్ని అంశాలూ
చెప్పి, బోధించి, విశదపరచి
నన్నో కవిని చేశారు
అందరికీ కవితాభివాదం!

27.7.2017, గురు
1.00 ఏ.ఎమ్

27.7.2017, గురు
3.50 ఏ.ఎమ్

ఇష్టం

తలుపు సందుకు
పెళ్ళిచూపొచ్చి
పలువరస విచ్చుకుంటే...
అదే –
పెళ్ళికూతురి ఇష్టం!

లిపి రహస్యం

సుఖదు:ఖాలు
రహస్యలిపులు

ఎప్పుడూ దారి తెలీని
బాటసారిని చేస్తాయి

ఎప్పటిదో ప్రయత్నం
కొనసాగుతూనే...

దు:ఖం లిపి బహుచిలిపి
జాగరూక రణం
రూక కోసం
బతుకు జాగరణం ఈమెతో!

పట్టించుకోకుండా

కవిత్వం

దూరమౌతూ ఆమో
నా శయ్యపైనే
సుఖనిద్రపోతుంది
అటు తిరిగి!

ఎటు తిరిగీ
నాకర్థం కానిది
ఆమె లిపి కదలికలే
గర్జనలా గురక పెడతాయి.

18.6.2018, సోమ:
5.05 ఎ.ఎం

కవితార్థం

పుటలాకసంలో
కొన్ని అక్షరాల మేఘాలు
అమాయికత్వం గాలి
చల్లని తాకిడికి
ఆనందంతోనో
విషాదంతోనో
చెలమలౌతాయి కళ్ళు

చిన్ననాటి కాగితప్పడవ
మగతనీ మసకనీ దాటించి
నిన్ను మోసుకుపోతుంది

అప్పుడవుతుంది అర్థం
కవిత్వం పరమార్థం!

18.6.2018, సోమ
5.20 ఎ.ఎం

అపరాజితం

కష్టం
ఓ వ్యసనమైనప్పుడు...

ఆ వ్యసనానికి
బానిసవైనప్పుడు...

గమనమే
విజయమయ్యే
ఎదురీతకు
పరాజయం లేదు...
రాదు!

1.11.2018 గురు
5 పి.ఎం

ముద్రాకృతి

పడుకున్న దుప్పటి
పట్టిచ్చే శరీరాకృతి ముద్ర
ఎన్నో ఊసులు చెబుతుంది
ఎన్నో బాసలు చేస్తుంది...

ముసుగేసిన దుప్పటి
రెబెకా శిల్పంలా మెరుస్తుంది
దోమల సంగీత కచేరీలో
తల చుట్టిన దుప్పటి
మదర్ థెరెసా అనిపిస్తుంది.

ఎప్పుడూ
ప్రశాంత గంభీరంగా ఉండే
ఆ దుప్పటి ముద్ర

కవిత్వం

ఈ మధ్య
మూడంకేస్తోంది...
అచ్చం గర్భస్థ పిండంలా!

ప్రశాంత గంభీర ముద్రలో
ప్రక్కనే స్తన్యం గుడుస్తున్న
పాపాయి చిన్ని ఆకృతి
త్వరలో జత కాబోతుందేమో!

ఆ ముద్రాకృతి
బహుకృతులకు బహూకృతి!

(అమ్మాయి సౌమ్య పడుకున్న తీరు చూసి...)

5.11.2018 సోమ
2 నుండి 2.23 ఎ.ఎం

కవిత్వం

బొమ్మ చూపడం
కవిత్వమనుకుంటే పొరబాటు
కన్ను చూడగల బొమ్మలదేముంది?

మనసూ చూడగల బొమ్మల్ని
వేసి చూపగలగాలి కవిత్వం

భావం, భాష చెలిమి భావశిల్పం
ఉద్భవించే కవిత్వం అనల్పం!

24.11.2018, శని
4.30 ఎ.ఎమ్

మనసుకు మనసైన...

వెలుగు నీడల
దాగుడుమూతలాట

పంచాంగం చూడని
సంచారమే అంతా...
సంచార సంభారమే!

ఎక్కడికనడిగితే
ఒక్కటే నవ్వు నవ్వు!

పోయిన చోట ఏమి చూసావంటే,
ఏమేమి చేసావంటే
అర్థంకాని హావభావాలతో
నోటిని మొహంలోకి ముడిచేసి
నీటుగా తాపడం చేసేస్తుంది.

వికార ఉన్మేషాల
అకారణ కావేషాల
వింత వింత తమాషాలు పోతుంది.

ఒక్కోసారెప్పుడో
మంచు ముసుగులో మల్లెలా
లేత చివుళ్ళ చిరుహాసంలా
జలజల రాలే పూరేకుల్లా
హ్లాదమానమౌతూ
తుషార ఉద్వేగాల
ప్రసార ఉత్సాహాల
ప్రహార ఉన్మాదాలు

పున్నమి వెన్నెల తరగలు
ఉప్పొంగి పొంగీ, ఉబలాటపడుతూ
పరువెత్తు నెక్కడికో...

అడవువల వెంటా
అగడ్తలంటా
కొండల మీదికీ
లోయల లోతుల్లోకీ
తడారిన ఎడారులంటా
పరచుకున్న పూదారులంటా...

ఇక్కడికక్కడికని లేదు

కవిత్వం

ఇప్పుడప్పుడనీ లేదు
ఎప్పుడైనా ఎక్కడికైనా

తరుచాపం నుండి
తెరచాప కట్టుకుని
బిరబిర తేలుతూ ఈదుతూ
చరచర చనునెక్కడికో!

మనసు చేసే సంచారం
అవుతుందెప్పుడూ సంభారం.

సంచార సంభారమో
సంభార సంచారమో
మనసంటే అదేనేమో..
అదదే మనసుకు మనసైనదేమో!

బ్రతుకు చెట్టు

లోహపు తాకిడి
స్రవిస్తుంది పాల కన్నీరు

మోడుగ మిగిల్చే
గొడ్డలిపెట్టు లోనే
వికసింపజేసే అంశమేదో!

ఆ అంశని మేల్కొలిపి
చిగురింపజేసే తడి స్పర్శ చినుకు!

లోహపు కర్కశ స్పర్శ లేకుంటే
తడి స్పర్శ చేసేదేముంది?!

కష్టనష్టాల ఉలితాకుడుల మధ్య
చిన్నపాటి ఆర్తిస్పర్శ...
వికసిస్తుంది బ్రతుకు చెట్టు!

16.4.2019 సోమ
2.30 –2.32 ఎ.ఎం

కవిత్వం